# శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానము జమలాపురం క్షేత్రం.

## సంక్షిప్త స్థల పురాణము

సనాతనమున జాబాలి మహర్షి తపస్సుకు మెచ్చిన కలియుగ వైకుంఠధాముడైన శ్రీనివాసుడు ప్రస్తుత శ్రీవారి ఆలయము నకు వెనుక ఉన్న సూచిగిరి పై దర్శనమిచ్చి ప్రత్యక్ష సేవకు ఆంగీకరించెను. తదాదిగా జాబాలి మహర్షి స్వామిని సేవించి తరించెను. తదనంతరం మానవమాత్రులకు స్వామి దర్శనం అందకుండెను. పరమాత్ముడైన శ్రీ వేంకటేశ్వరుడు భక్తులను తనవద్దకు రప్పించుకొను నిమిత్తం ఒక గోపాలకునిగా, తోటి గోపాలకులతో కలసి ఆటలాడి, పాటలు పాడుచుండెను. ఆబాలుని సమ్మోహన రూపంచూసి పరవశులై ఎవరునీవు అనిప్రశ్నించగా నేనే నీవు,నీవే నేను అనుచు పలుకుచుండెడివాడు పరమభక్తుడు,ఉప్పల వంశీయుడైన యజ్ఞనారాయణ శర్మకు ప్రత్యక్షంగా దర్శనమిచ్చి నన్ను సేవించి తరించమని ఆజ్ఞాపించెను.

శ్రీ స్వామి సేవాభాగ్యం పొందుచూ తరించిన ఉప్పల వంశీయులలో ఆరవతరమైన అక్కుభట్టు ఒకనాడు శ్రీ వారికి నైవేద్యంతో కొండపైకి ఎక్కుచు క్రిందపడి పోయి, బాధతో స్వామీ ఆకలివేస్తే నీవే దిగిరా, ఇక నావల్లకాదు అని కోరినంతనే కొండదిగి వచ్చిన కొండలరాయుడు ఈ శ్రీనివాసుడు. పరమభక్తుడైన శ్రీ అక్కుభట్టు భక్తిని మెచ్చి స్వామి వారు స్వయంగా కొండ దిగివచ్చి అతడు తెచ్చిన నైవేద్యాన్ని స్వీకరించి, ఈ రోజునుండి నా దర్శనం చేసుకున్న భక్తులకు "దారిద్ర్యాన్ని" తొలగించి సుఖసంతోషాలు ప్రసాదిస్తానని, గోవిందా,గోవిందా అని స్మరిస్తూ ఈ కొండచుట్టు ప్రదక్షిణలు చేసినవారికి ఏడు జన్మల పాపపరిహారం జరుగుతుందని,తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్న వారికి సకల సౌభగ్యాలు,కోరినకోర్కెలు నెరవేరుతాయని ఈ ఆలయ ప్రాశస్త్యమును కలియుగంలో భక్తులకు చాటి చేప్పే బాధ్యత నీవే స్వీకరించాలి అని ఆకాశవాణిగా చెప్పబడినదని చరిత్రాధారములు కలవు. అనాటి నుండి పై విధముగా ఎవరైతే స్వామి వారిని దర్శిస్తున్నారో అందరికీ సుఖసంతోషాలు ప్రాప్తించుచున్నవి. శ్రీవారి పాదం నేటికీ గత చరిత్రకు సాక్షిగా నిలిచినది.

స్వయంవ్యక్తముగా సాలగ్రామ శిలారూపంలో వెలసి నిత్యపూజలు పొందుచూ భక్తులెల్లరిని బ్రోచుచున్న"ఆపదమొక్కుల వాడు" ఈ వేంకటేశ్వరుడు. "గోవిందా" అని పిలిచినంతనె సిరులుకురిపించు లక్ష్మీవల్లభుడితడు. "అన్యథాశరణంనాస్తి,త్వమేవ శరణంమమ" అని తలచుచూఏకాదశ ప్రదక్షిణలు (11) చేసినంతనే, మీ కష్టసుఖాలలో నేను తోడు ఉంటానని తెలిపే వరద, అభయహస్తములతో సాక్షాత్కరించు కమలనాభుడు జమలాపురీశుడు. కోరిన కొర్కెలు తీరినంతనే భక్తిశ్రద్ధలతో మండల ప్రదక్షిణలు (41) చేసినంతనే సంతృప్తి చెందే నిత్యకళ్యాణ మూర్తి ఈ దేవదేవుడు. ఇట్టి మహిమాన్వితమైన ఈ జమలపురం క్షేత్రాన్నిదర్శించి తరించవలసినదే కాని వర్ణించుటకు అలవికానిది. ఈ దివ్యక్షేత్రం 13 వశతాబ్దంలో కాకతీయ రాజుల్లో ప్రసిద్ధుడైన ప్రతాపరుద్రదేవుడు తన జైత్రయాత్రలో భాగంగా జమలాపురం క్షేత్రాన్ని దర్శించి శ్రీవారికి మొక్కులు సమర్పించినట్లుగా మరియు 1535 సం॥లో విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీ కృష్ణదేవరాయలు కొండపల్లి కోటను వశపరుచుకొనుటకు ముందుగా శ్రీ వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించినట్లుగా చరిత్రాధారములు కలవు.

దేవాదాయ శాఖ వారి ఆధీనములోనికి 1965-1966లో తీసుకొని, దేవాలయ పునరుద్ధణ ను 1969 లో అప్పటి రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ శీలం సిద్దారెడ్డి గారి పర్యవేక్షణలో ప్రారంభించి 1976 మార్చి 26 న శ్రీశ్రీశ్రీ శృంగేరి జగద్గురువులు భారతీ తీర్ధ మహాస్వామి వారి ఆశీస్సులతో అప్పటి వ్యవస్థాపక ధర్మకర్త శ్రీ ఉప్పల కృష్ణమోహన శర్మ దంపతులు మహాకుంభాభిషేకము, స్వామి వారి విగ్రహప్రతిష్ఠ మరియు ధ్వజ ప్రతిష్ఠ గావించినారు. భక్తులెల్లరు కలియుగదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని మరియు ఉభయదేవేరులైన శ్రీ అలమేలు మంగ, శ్రీ పద్మాతి అమ్మవార్లును దర్శించి తరించగలరు. ప్రస్తుతము ఈ క్షేత్రము దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ హోదా కల్గియున్న కార్యనిర్వహణాధికారి ఏలుబడిలో నిర్వహించబడుచున్నది.

ఈ దేవాలయమునకు అనుబంద దేవాలయముగా శ్రీ సీతరామచంద్రస్వామి దేవాలయము వెంకటాపురం నందు గలదు.

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవసానం జమలాపురం గ్రామము, ఎర్రుపాలెం మండలం, ఖమ్మంజిల్లా నందు వేంచయబడి యున్నది. ఈ దేవాలయము ఎర్రుపాలెం మండల కేంద్రమునకు 6 కి.మీ దూరంలో మరయు జిల్లా కేంద్రము ఖమ్మంనకు 95 కీ.మీ దూరం లో మరియు విజయవాడ నగరం నకు 55 కీ,మీ దూరంలో కలదు. ఈ దేవాలయునందు తిరుమల తిరుపతి దేవస్థానము వారిచే 10 గదుల సత్రము మరయు శ్రీ చారుగుండ్ల నరేంద్ర 10 గదుల సత్రము భక్తుల సౌకర్యార్థం నిర్మించబడి ప్రస్తుతం దేవస్థానము చే నిర్వహించబడుచున్నది. జిల్లా కేంత్రము నుండి రైలు మార్గము ద్వారా పలు రైళ్ళ ( కృష్ణ,గోల్‌కోండ మరియు ప్యాసింజర్) రైళ్ళ ద్వారా ఎర్రుపాలెం  చేరుకొని  బస్సు/ ప్రైవేటు వాహనముల ద్వారా చేరుకొనవచ్చును.

ఈ దేవాలయమునందు వివరములకై సంప్రదించు ఫోన్ నెంబర్‌లు 08749-279855, 9491000705, సంప్రదించగలరు.

స్వామివారి సేవలో.......